



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర


సంపుటి : 8 సంచిక : 10 పుష్పం : 25-27 05-02-2003

**RAMANA BHASKARA**

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 8 ISSUE : 10

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

PUBLISHER
**P.S. RAMARAJU**
LAKSHMI
MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 4-12-2002, మురమళ్ళ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఎవరికీ దుఃఖం అంటే ఇష్టం ఉండదు. దుఃఖం వస్తూ ఉంటే నాకు రావద్దు, నాకు రావద్దు అంటారు. డబ్బు ఉంటే వారికి దుఃఖం ఉండదేమో అనుకొంటారు, వారికి మరీఎక్కువ దుఃఖం ఉంటుంది. దుఃఖకారణం అసలు బయటలేదు, దుఃఖకారణం నీలోపలే ఉంది. ప్రతీ మనిషికి ఏదోరకమైన కొరత, వెలితి ఉంటుంది. ప్రతీమనిషిని ఏదోరకమైన దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. ఒక్క జ్ఞాని తప్పించి, నాకు ఏరకమైన దుఃఖం లేదు అని చెప్పేవాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు. దుఃఖానికి కారణం బయట ఉంటే దానిని తేలికగా తీసేయవచ్చు కాని దుఃఖానికి కారణం నీలోపల ఉంది కాబట్టి దానిని తీయటం కష్టం. పూర్వజన్మలో మనం అనుభవించిన భోగాలే ఈజన్మలో రోగాలక్రింద వస్తాయి. ఇప్పుడు మనం అనుభవించే భోగాలన్నీ రాబోయే జన్మలో రోగాలక్రింద వస్తాయి. మన దుఃఖానికి ఏ మూలతలంపు అయితే కారణమో ఆమూలతలంపును దానిమూలమైన హృదయంలోనికి తీసుకొనివెళితే అది నశిస్తుంది, అది నశిస్తే దుఃఖం కూడా పోతుంది. మనకు జీవలక్షణాలు నశిస్తే గాని జీవుడు నశించడు. ఈ జీవలక్షణాలను తొలగించుకోవటానికే భక్తియోగం, ధ్యానయోగం, కర్మయోగం, జ్ఞానయోగం ఈ యోగాలన్నీ చెప్పారు. యోగం అభ్యసించటానికి ధైర్యం అవసరం, పవిత్రత అవసరం, నిశ్చలత అవసరం, ప్రశాంతత అవసరం. యోగాభ్యాసం చేసేటప్పుడు మీరు భయపడుతూ ఉంటే ఆ యోగం సక్సెస్

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


| | | |
|---|---|---|
| 04-12-02 | మురమళ్ళ | 1 |
| 15-12-02 | కాపవరం | 6 |
| 05-01-03 | లంకలకోడేరు | 11 |





Visit us @ www.srinannagaru.com




అవ్వదు. మాకు శాంతి లేదు, మాకు శాంతి లేదు అనేవారే గాని, మాకు శాంతి రావటానికి తగిన పవిత్రత, యోగ్యత, అర్హత లేదు అనేవారు ఒక్కరూ కనబడటంలేదు. మీరు యోగి కావాలంటే భయం తగ్గించుకోవాలి, గర్వం తగ్గించుకోవాలి, అవసరంలేని విషయాలు తగ్గించుకోవాలి. మనకు ఉన్న రూపంకంటే, నామం కంటే, ధనం కంటే, కీర్తి కంటే గుణం గొప్పది. ఎందుచేతనంటే ఈ రూపాన్ని ఇక్కడే కాల్చేస్తారు దానితో పాటు పేరు కూడా పోతుంది. ఈ శరీరం ఉండగా ధనం పోవచ్చు, లేకపోతే ధనం ఉండగా ఈ శరీరం పోవచ్చు. కీర్తి కూడా అంతే. కాని గుణం మటుకు ఈ శరీరం చనిపోయిన తరువాత కూడా మనకూడా వస్తుంది. అందుచేత మంచిగుణాలను అలవర్చుకోవాలి. మంచిగుణలను ఎందుకు సంపాదించాలి అంటే జ్ఞానసముపార్జనకు మంచిగుణాలు సహకరిస్తాయి. కొంతమంది రాజీపడకుండా మంచిగుణాలను సంపాదించుకొంటారు. అటువంటివారిని జ్ఞానం వరిస్తుంది. ఎవరిపట్ల ద్వేషం పనికిరాదు. ద్వేషం ఉంటే ధర్మాచరణ చెడిపోతుంది. అందుచేత ద్వేషంలేకుండా చూసుకొంటూ ధర్మాచరణను కాపాడుకో, అహారవిషయంలో జాగ్రత్తగాఉంటూ నీ ఆరోగ్యాన్ని కాపాడుకో, పనియందు గౌరవం పెంచుకొని, శ్రద్ధ పెంచుకొని సోమరితనం రాకుండా చూసుకో. ఇవిఅన్నీ నీవు జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఇవన్నీ కాపాడుకొంటే కదా నీకు సత్యానుభవం కలిగేది. మనందరం ఇప్పుడు అస్వతంత్రులము. మన హృదయంలో ఉన్న సత్యం మనకు అనుభవంలోనికి వస్తేగాని మనం స్వతంత్రులం కాలేము. ధర్మాన్ని ఆచరించేటప్పుడు ఎవరూ నీకు జతరాకపోయినా ఒంటరిగా అయినా ధర్మాన్ని ఆచరించు. ధర్మాన్ని ఆచరించకుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ధర్మాన్ని ఆచరించకపోతే నీకు మనోనిగ్రహం రాదు. నీవుధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే నీ మనస్సు పవిత్రం అవుతుంది, అప్పుడు మనస్సులో ఉన్న దోషాలనుండి విడుదల పొందుతావు. నీవు ధర్మాన్ని ఆచరించడం వలన, ధర్మం పట్ల గౌరవం పెంచుకోవటం వలన నీకు ఆత్మజ్ఞానం కలుగకుండా ఏదైతే అడ్డువస్తోందో దానిలో నుండి విడుదల పొందుతావు అని భారతంలో చెప్పారు.

జ్ఞాని అందరిపట్ల సమానంగా ఉంటాడు అని చెపుతున్నారు దాని గురించి వివరణ చెప్పండి అని అడిగితే జ్ఞాని చూసేటప్పుడు మన మనస్సును చూడడు, మన రంగును చూడడు, మన శరీరాన్ని చూడడు. మన గుణాలను చూడడు. తన హృదయంలో ఏ వస్తువు అయితే ఉందో అదే అందరి హృదయాలలో ఉంది, ఆ వస్తువునే జ్ఞాని చూస్తూ ఉంటాడు. అందువలన జ్ఞానికి భిన్నభావం రాదు. అందరి పట్ల సమానంగా ఉంటాడు. జ్ఞానికి దయ, ప్రేమ, సంతోషం, స్నేహం వంటివి సహజంగా ఉంటాయి. మనం ఏదైతే సంపాదించుకోవాలి అనుకొంటున్నామో అది జ్ఞానిలో సహజంగానే ఉంటుంది. భగవాన్ ఒకసారి మాటల సందర్భంలో రంగన్‌తో మీతో మాట్లాడే పని నాకులేదు అన్నారు. మరి అయితే మాతో ఎందుకు మాట్లాడుతున్నారు అని రంగన్ అడుగుతాడు. మీతో పనిఉండి మాట్లాడటంలేదు. దయవలన, ప్రేమవలన మాట్లాడుతున్నాను అని చెప్పారు. జ్ఞాని ఎప్పుడు చూసినా ఆనందంలోనే ఉంటాడు

ఎందుచేతనంటే జ్ఞాని ఎప్పుడూ హృదయంలోనే ఉంటాడు. దేహం ప్రారబ్దంననుసరించి నడిచివెళ్ళిపోతుంది. మీరు దేహంతోటి, మీ రూపంతోటి, మీ నామంతోటి తాదాప్యం పొందకుండా ఉంటే ఆత్మజ్ఞానం ఇప్పడే ఇక్కడే మిమ్మల్ని వరిస్తుంది. ఆత్మానందంతో సమానమైన ఆనందం లేదు, ఆత్మవిద్యతో సమానమైన విద్యలేదు, అది స్వతంత్రమైనది. ఇక్కడ మీరు శ్రద్ధగా వింటున్నారు అనుకోండి, నాన్నగారు బాగా చెపుతున్నారు శాంతిగా ఉంది అనుకొంటారు. ఇంటికి వెళ్ళాక ఇంత ఆలస్యమయ్యింది ఏమిటి, ఇంటికి చుట్టాలు వస్తే కాఫీ ఎవరు ఇస్తారు అని తిట్టారు అనుకోండి సడన్‌గా మీ శాంతి అంతాపోతుంది. ఎందుచేతనంటే మీరు పొందే శాంతి తాత్కాలికమైనది, స్వతంత్రమైనది కాదు. కాని జ్ఞాని పొందే సుఖం, శాంతి అలా చెదరదు, కదలదు ఎందుచేతనంటే అది స్వతంత్రమైనది. ఎప్పడూ గురువుపట్ల గౌరవం విడిచిపెట్టకూడదు. గురువుపట్ల గౌరవం విడిచిపెడితే సబ్జక్టు ఎంతవిన్నా మీకు అర్ధంకాదు. వినేవాడికి సహృదయం ఉంటే, గ్రహించేశక్తి ఉంటే గురువు సముద్రంలాగ పొంగి జ్ఞానాన్ని మనకు ఇస్తాడు, జ్ఞానంగురించి చెప్పటం కాదు, ఇస్తాడు వాడుగురువు. భక్తులకు ఉన్న సహృదయాన్ని బట్టి, వారికిఉన్న గ్రహింపుశక్తినిబట్టి గురువు టీచింగ్ ఉంటుంది. జ్ఞానికి మంచి వారిపట్ల ఆప్యాయత ఉంటుంది, దుష్టులపట్ల క్షమ ఉంటుంది, బుద్దిలో ఎన్ని వంకరలు ఉన్నా, ఎన్ని అపరాధాలుచేసినా క్షమిస్తాడు. ఇవిఅన్నీ జ్ఞానికి అతిసహజంగా ఉంటాయి. మీరు కష్టపడి సంపాదించుకోండి అనిచెపుతున్నారు. పెరుమాళ్ళు భగవాన్‌పట్ల ఎన్నో అపరాధాలు చేసాడు. భగవాన్‌ను చాలా హింసపెట్టాను అని చనిపోయేముందు అనుకొంటాడు. అప్పడు భగవాన్ దగ్గరకు వచ్చి స్వామీ! మీపట్ల నేను ఎన్నో అపరాధాలు చేసాను, చనిపోయిన తరువాత నేను నరకానికి వెళతాను అంటాడు. అప్పడు భగవాన్ పెరుమాళ్ళుతో నీవు నరకానికి వెళితే నీకోసం నేనుకూడా నరకానికి వస్తాను అని చెప్పాడు. నువ్వు అపరాధం చేసాను అంటున్నావు, నీవు మంచికూడా చేసావు, నేను ఆ మంచిని గుర్తుపెట్టుకొంటాను. నీవు నరకానికి వెళితే నిన్ను ఉద్దరించటానికి నేనుకూడా నరకానికి వస్తాను అన్నాడు, వాడుగురువు. జ్ఞాని ఏపని చేసినా ఇతరులకోసమే, తనకంటూ ఏమీలేదు.

భగవాన్ పదేపదే చెప్పేది ఏమిటి అంటే మీజీవితంలో అనేకసంఘటనలు జరుగుతూ ఉంటాయి. వాటితో తాదాప్యం పొందవద్దు. మనం పెద్ద పెద్ద పనులు చేయనక్కరలేదు. మనడ్యూటీ మనం సక్రమంగా చేస్తే సరిపోతుంది, భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతాము. ఏఉపాధికి ఏపని నియమింపబడిందో ఆ పనిని హృదయపూర్వకంగా ప్రేమతో, శ్రద్దగా, ఇష్టంతో చేయటమే ధర్మం. విసుగ్గా, కోపంగా, భయంతో చేయకండి. నువ్వు కానిదానితో తాదాప్యం పొందుతున్నావు. నువ్వు ఏదైతే అవునో దానివెంట పడకుండా, కానిదానివెంట పడుతున్నావు. ఇది వివరించటానికే గురువు అవసరం. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. అక్కడకు చేరుకునేవరకు నిజం అనేది మనకు తెలియదు. నిజంతెలిస్తే గాని మనకు స్వాతంత్ర్యం లేదు, స్వేచ్ఛ లేదు, సుఖం లేదు. అది వ్యవహారికనిజం కాదు పారమార్ధిక నిజం.



హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళాలంటే తలంపుల యొక్క వేగం తగ్గాలి, మాటలలో ఉన్న ప్రకోపం తగ్గించుకోవాలి, చింతించేవాడు సన్నగిల్లాలి. పని చెయ్యండి, అహంభావన లేకుండా పనిచెయ్యండి, కర్తలేని కర్మ చెయ్యండి. కర్తలేని కర్మ చేస్తే అదికూడా యోగంతో సమానము. మనం నోటితో మాటలు చెపుతాము గాని చేతితో ఎవరికీ ఏదీ చేయము. మన నోరు చెపుతూ ఉంటుంది. కాని చేతులు వద్దని చెపుతాయి. మన నోటికి, చేతికి అంతదూరం ఉన్నప్పడు హృదయం యొక్క లోయలలోనికి ఎలా వెళ్ళగలము, ఇంక ఈశ్వరానుగ్రహం ఎలా కలుగుతుంది. మీ గౌరవాన్ని కాపాడుకొంటూ మీ విరోధుల గౌరవం పాడుచేస్తారా. ఇటువంటి వారికా జ్ఞానం కలిగేది. ఇతరులు నీ పట్ల మర్యాదగా ఉండాలని అనుకొంటున్నావు, మరి నువ్వు ఇతరులపట్ల మర్యాదగా ఉండవద్దా. ఈ మాత్రం చిన్న విషయాలు కూడా నీకు అర్ధం కావటం లేదా. నీకు ఏది దుఃఖకారణమో అది ఇతరులకు కూడా దుఃఖకారణం అనినీకు తెలియటంలేదు. నువ్వు ఎవరు? చైతన్యమే, నువ్వు దానితో తాదాప్యం పెంచుకోవాలి, కానిదానితో తాదాప్యం తగ్గించుకోవాలి. భ్రాంతిలోనుండి బయటకు వచ్చిన వాడికి గాని బ్రహ్మవిద్య అలవడదు. ధర్మాన్ని ఆచరించకుండా ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం సాధ్యం కాదు. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేనివాడు బుద్దిలో ఉన్న దోషాలనుండి విడుదల పొందలేడు. అలవాట్ల విషయంలో బహుజాగ్రత్తగా ఉండండి. పూర్వ జన్మ సంస్కారములను బట్టే మనకు ఈ అలవాట్లు వస్తున్నాయి. ఇప్పడు ఏ విషయం మీద అయితే మీ మనస్సు ఎక్కువగా వాలుతోందో పూర్వజన్మలో దానిని బాగా ఎంజాయ్ చేసింది కాబట్టి ఇప్పడు ఆ విషయం మీదకు ఎక్కువగా వెళ్ళిపోతుంది. విషయాలే విషం. బాహ్యంగా ఉన్న విషం ఈ శరీరాన్ని చంపుతుంది గాని విషయాలనే విషం నీకు లక్షలాది జన్మలకు కారణం అవుతుంది. ఆత్మచింతన వలన మనస్సు పరిశుద్ధమవుతుంది. విషయచింతనవలన అపరిశుద్ధమవుతుంది. యల్.కె.జి. కూడా చదవకుండా పెద్ద ఉద్యోగం కోసం ప్రయత్నంచేయటం ఎటువంటిదో, పవిత్రుడు కానివాడు మోక్షం కోసం ప్రయత్నం చేయటం అటువంటిదే. పవిత్రత చాలా ముఖ్యం. మీరు శాంతిగా ఉంటే అది అమృతంతో సమానము. మీకు శాంతి లేనప్పడు ఇంటినిండా ఎంత సంపద ఉన్నా మీరు సుఖపడలేరు. ప్రపంచంలో ఉన్న ధనం అంతా తీసుకుని వచ్చి ఇక్కడ గుట్టక్రింద పోసినా ఆధనం అంతా శాంతి ముందు సరిపోదు, శాంతితో సమానం కాదు. రోజూ ఒక గంట ఇంటిదగ్గర ఏకాంతంగా కూర్చొని మీ మనస్సును చూసుకోండి. ఏ కారణం వలన మనస్సు కదులుతోంది. ఏకారణం వలన అది శిరస్సులోనికి వచ్చి విజృంభిస్తోంది అని చూసుకొని ఆకారణాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నంచేయండి, మీరు ఏదైతే పోగొట్టుకోవాలనుకొంటున్నారో ఆలోచించుకొని, అది లేనివారితో సహవాసం చెయ్యండి, వారిని గౌరవించండి, వారిని గౌరవిస్తే మీ బలహీనత నశిస్తుంది. మన బలహీనతలు ఏమిటో చూసుకొని, వాటిలోనుండి విడుదల పొందటానికి మనం చేస్తున్న ప్రయత్నమే సాధన. మిమ్మల్ని మీరు ఉద్దరించుకోవటానికి ప్రయత్నం చేస్తూఉంటే

భగవంతుడి సహాయం అందుతుంది. మీరు చేస్తున్న కృషే కృపగా మారుతుంది. మన హృదయంలో ఉన్న సత్యవస్తువు మనకు తెలియబడటానికి సిద్ధంగా ఉంది. అది మనకు తెలియబడకుండా ఏ అలవాట్లు అయితే మనకు అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకొంటే ఇప్పుడే, ఇక్కడే ఆ వస్తువు మనకు అనుభవంలోనికి వస్తుంది. సజ్జనుల మధ్యలో కూర్చొంటే మీకు శాంతి కలుగుతుంది. వారి వైబ్రేషన్స్ వలన మీకు శాంతి కలుగుతుంది. అంతేగాని అది మీసొంతం కాదు. అది మీసొంతం అవ్వాలంటే మీ అలవాట్లు, వాసనలు అన్నీ వేరుతో సహా నశించాలి. మీలో వాసనలు బలీయంగా ఉన్నప్పుడు సాధన ఎక్కువ చేయాలి. మీరు సాధన హృదయపూర్వకంగా నిండుమనస్సుతోచేస్తూఉంటే, ఈశ్వరుని పాదాలను ఆశ్రయించి సాధన చేస్తూఉంటే మీఅలవాట్లలోనుండి, వాసనలలోనుండి విడుదలపొందుతారు, లోపల ఈశ్వరుడి తాలుక అనుభవం మీకు కలుగుతుంది. మీ అలవాట్లలోనుండి విడుదల పొందటానికి సాధన చేస్తూఉంటే మీశరీరానికి మరణం వచ్చేసింది అనుకోండి అప్పుడు మీరు చేసే సాధన తరువాత జన్మలో కంటిన్యూ అవుతుంది. మద్రాసులో సినిమా తీసి ఇక్కడ సినిమాహాలులో చూపిస్తున్నారు అనుకోండి. అందులో కొన్ని మంచి పాటలు, కొన్ని చెడ్డపాటలు ఉన్నాయి అనుకోండి. బాగున్న పాటలను ఎలా విన్నామో అలాగే మనకు నచ్చని పాటలను కూడా వినాలి ఎందుచేతనంటే తీరా టిక్కెట్టు కొనుక్కుని వెళ్ళాము, సినిమా చూసి రావాలి కాదా, అలాగే ఈ దేహం ప్రారబ్దం అనుభవించటానికి ఈ లోకంలోనికి వచ్చింది. ఈ దేహానికి మంచి ప్రారబ్దం ఉండవచ్చు, చెడు ప్రారబ్దం ఉండవచ్చు. ఆ గొడవ నీకు వద్దు. ప్రారబ్దం అనుభవించిన తరువాత ఆ దేహం నశిస్తుంది. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టండి అనేవారు భగవాన్. భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు, మన దేహాన్ని ప్రారబ్దముననుసరించి ఆడిస్తున్నాడు. ఆయన చేసే పని సైలెంట్‌గా చేస్తాడు. ఆయన చేసే పని మనకు కనబడదు. సాధన విషయంలో అజాగ్రత్తగా ఉండవద్దు. మన హృదయంలో ఉన్న వస్తువు మనకు అనుభవంలోనికి వచ్చేవరకు సాధన చేయాలి, అంతవరకు ముగింపులేదు. సాధన చేసేటప్పుడు విసుగు రాకూడదు, సాధనలో తొందరపాటు పనికిరాదు, నిదానంగా ఉండాలి. నిదానంగా ఉంటే, మీరు సాధనలో అభివృద్ధిలోనికి వస్తారు. ఇల్లు కట్టుకొనేటప్పుడు చాలా శ్రమ ఉంటుంది, కట్టటంపూర్తి అయ్యాక ఆశ్రమఅంతా మర్చిపోతాము. అలాగే మీకు ఆత్మజ్ఞానం కలిగింది అనుకోండి, ఆత్మజ్ఞానసముపార్జనకు మీరు పడిన కష్టం, మీరు చేసిన సాధన అంతా సహజంగా మర్చిపోతారు. మీ పని ఏదో మీరు శ్రద్ధగా చేసుకొంటూ మీ హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయండి. మన హృదయంలో మనం ఉన్నప్పుడు ఎదుటివారు చెడ్డవారైనా, మంచివారైనా మనకు ఏమీ అనిపించదు. కాలాన్ని పాడుచేసుకోవద్దు, గడచిన కాలం తిరిగిరాదు. వ్యాపకాలుతగ్గించుకోండి, మాటలు తగ్గించుకోండి. మాటలు వెండి, మౌనం బంగారం. మౌనం వలన బోధ అందుతూ ఉంటే నాకుమాటలతో పనిలేదు, ఈ ప్రసంగాలు చేయనక్కరలేదు. మౌనం అన్నింటికంటే గొప్పది.





నీవు తెలుసుకోవలసిన వస్తువు ఒక్కటే ఉంది, అది నీకు దూరంగాలేదు, నీ శరీరం కంటే, మనస్సు కంటే, ఇంద్రియాలకంటే అత్యంత సమీపంగా నీ హృదయంలోనే ఉంది, అంతేకాదు అది నీవై ఉన్నావు. నీవు ఆత్మగా ఉండి ఆత్మను ఎలా తెలుసుకోవాలి అంటున్నావు. నీ మనస్సును నియమించుకో, దాని విజృంభణను ఆపుచెయ్యి, మనస్సు యొక్క చలనాన్ని అరెస్టు చెయ్యి అప్పుడు ఆత్మగురించి నీకు తెలుస్తుంది, దాని రుచి నీకు అందుతుంది. సర్వకాల సర్వావస్థలలో నీకు అదృష్టం వెంటాడినా, దురదృష్టం వెంటాడినా, పరిస్థితులు నీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా నీవు కుశలంగా ఉండు, నిర్మలంగా ఉండు, కూల్ మైండ్‌తో ఉండు. అలా నిర్మలంగా ఉంటావనుకో, నిశ్చలంగా ఉంటావనుకో, నిన్ను ఎవరైనా స్తోత్రంచేసినా, విమర్శచేసినా సమానంగా ఉంటావనుకో అహంభావనకు వెళ్ళే మేత ఆగిపోతుంది, అది నశిస్తుంది, అంతకంటే నీకు ఏమి కావాలి. అహంభావన నశించటం, జ్ఞానం కలగటం రెండూ ఒకేసారి జరిగిపోతాయి, అదే నీ జీవితగమ్యం. మనగురి అంతా హృదయంలో ఉన్న సత్యం మీదే ఉండాలి. మాట్లాడితే దానికోసం మాట్లాడాలి, పనిచేస్తే దానికోసం పనిచేయాలి, చూస్తే దానికోసం చూడాలి, భౌతికమైన ప్రయోజనాల కోసం కాకుండా మన గురి అంతా సత్యంమీదే ఉండాలి. నీ మనస్సును, ఇంద్రియాలను హృదయంలో ఉన్న సత్యంమీదే కేంద్రీకరించి ఉంచాలి. ఆ రకంగా జీవిస్తూ ఉంటే నీ హృదయంలో ఉన్న చీకటి అంతా పోతుంది, సత్యం నీకు అనుభవంలోనికి వస్తుంది.

### సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 15-12-2002, కాపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు గీతాజయంతి. ఈ ప్రపంచంలో ఒక పుస్తకానికి జయంతి జరిగేది భగవద్గీతకు మాత్రమే. ఇది భగవంతుడు స్వయంగా చెప్పిన శాస్త్రం. భగవంతుడు గీతను చెపుతూ ఇది నేను క్రొత్తగా చెప్పటంలేదు, వేదాలసారం ఉపనిషత్‌లసారం చెపుతున్నాను అని చెప్పాడు. నాకు చిన్నప్పుడు తల్లిపోయిన గీత నాకు తల్లిలేని లోటు తీర్చింది అని గాంధీగారు చెప్పారు. గీత భారతంలో ఉండటంవలననే అది, మహాభారతం అయ్యింది. మీరు బాగుపడాలంటే గీతను అధ్యయనం చేయండి అని పెద్దలు చెపుతారు. మొదట గీతకు వ్యాఖ్యానం వ్రాసి ప్రచారం చేసింది ఆచార్యులవారు. గీత చదివితే అన్ని గ్రంధాలు చదివినట్లే. అందరూ భగవద్గీతను అధ్యయనం చేయండి, అర్థం చేసుకోండి, ఆచరించండి. గీతను అధ్యయనం చేయటం వలన పుణ్యం వస్తుంది. దానిని అర్థంచేసుకొని ఆచరిస్తే జ్ఞానం కలుగుతుంది. గీతను అర్థం చేసుకోవటానికి మనకు తగిన అర్హత, యోగ్యత ఉండాలి, భగవంతుడు ఉన్నాడని మనకు సజీవమైన విశ్వాసం ఉండాలి, మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం ఉండాలి. మనస్సును అదుపుచేసుకొంటే ఎక్కడైనా ఆనందంగా ఉండవచ్చు. మనోనిగ్రహం వలన, ఇంద్రియ నిగ్రహంవలన సభ్యత వస్తుంది. బుద్ధుడు చాలా సభ్యత, సంస్కారం ఉన్న మనిషి అని చెపుతారు.

ఆయన అనవసరమైన మాటలు మాట్లాడలేదు. మహిమలుచేసి ప్రజలను ఆకర్షించే అలవాటు బుద్ధుడికి లేదు. భగవంతుడు ఉన్నాడా, లేడా అంటే ఆయన మౌనం వహించేవాడు. ఒకసారి బుద్ధుడితో ఆయన సవతితమ్ముడు ఆనంద్ మాట్లాడుతూ మీలాంటి మహాత్ముడు ఈ భూమి మీద జన్మించలేదు అంటే ఆయన దానిని అంగీకరించలేదు. మనం అయితే బాగా చెపుతున్నాడు అనుకొంటాము అది మన అమాయకత్వానికి, అజ్ఞానానికి గుర్తు. బుద్ధుడు తమ్మునితో నీవు హిస్టరీ చదివావా అని అడిగాడు. నేను చదవలేదు అని ఆనంద్ చెప్పాడు. హిస్టరీ నీకు తెలియకుండా, ఇంతకుముందు జన్మించిన మహాత్ముల గురించి నీకు తెలియకుండా బుద్ధుడు అంతటివాడు పుట్టలేదు అని చెప్పే అర్హత నీకు లేదు అని చెప్పారు.

సభ్యత, సంస్కారం చాలా ముఖ్యం. మనోనిగ్రహం లేకపోతే సభ్యత రాదు, నాగరికత పెరగదు. మనం డబ్బు సంపాదించి ఇస్తున్నాము గాని సభ్యత నేర్పాలి అనే భావన మనలో లేదు. మీలో మానసికవత్తిడి లేనివారు ఎవరూ ఉండరు. సత్యానుభవం కలిగేవరకూ ఏదోరకమైన వత్తిడికి గురిఅవుతూనే ఉంటారు. మీరు అతిగాతిని ఇక్కడకు వస్తారు అనుకోండి, మత్తు వస్తుంది. ఇక్కడ చెప్పేది ఏమీ తెలియదు. అతిగా తినటం వలన, చెడు స్నేహాల వలన, అతిగా మాట్లాడడం వలన బాహ్యంగా వత్తిడి వస్తుంది. ఒకరి మీద ఇష్టం, ఒకరి మీద అయిష్టం అంటే రాగద్వేషముల వలన, లేనిపోనివి ఊహించుకోవటం వలన లోపలనుండి వత్తిడి వస్తుంది. వీటి వలన మానసికవత్తిడి వస్తుంది. మనం ఏదైనా కోరికతో పీడించబడుతూ ఉంటే శారీరక ఆరోగ్యం, మానసికఆరోగ్యం దెబ్బతింటాయి. ఉన్న వస్తువు ఒక్కటే, అంతా పరమాత్మే అనే అనుభవం రావటానికి కామక్రోధ రహితుడవు అవ్వాలి, పరిపూర్ణంగా మనస్సును నిగ్రహించుకోవాలి. ఇప్పుడు మనం ఎక్కడ ఉన్నాము? కాపవరంలో ఉన్నాము అనుకొంటున్నాము. కాని కాపవరంలో లేము. మన దేహం కాపవరంలో ఉంది, మనం హృదయంలోనే ఉన్నాము. కాని మనం హృదయంలో ఉన్నాము అన్న సంగతి మనకు తెలియటంలేదు. అది దేహాభిమానానికి గుర్తు. మనం హృదయంలోనే ఉన్నాము అన్నసంగతి మనకు తెలియాలి. అది తెలిస్తే సుఖం, అది తెలియకపోతే దుఃఖం. హృదయంలోనికి వెళ్లటానికి లోచూపు కావాలి. నీకు సభ్యత లేనప్పుడు, అర్హత లేనప్పుడు నీకు లోచూపురాదు. లోచూపు లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. కామక్రోధరహితులకు, పరిపూర్ణంగా మనస్సును నియమించుకొన్నవారికి, హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకొన్నవారికి ఉన్నదంతా పరమాత్మే, అది తప్పించి ఏదీ కనబడదు. మీకు చాలా తలంపులు వస్తున్నాయి. ఇవి అన్నీ ఎవరికి వస్తున్నాయి? దేహము నేను అనే తలంపుకు వస్తున్నాయి. ఆతలంపు ఎక్కడనుండి వస్తోంది. ఎక్కడయితే భగవంతుడు ఉన్నాడో అక్కడ నుండి వస్తుంది. ఆ తలంపును పట్టుకొని దాని మూలంలోనికి వెళ్ళు, అప్పుడు దేహము నేను అనే తలంపు మాయమవుతుంది, భగవంతుడు దర్శనమిస్తాడు.

మన కంట్రోలర్ మన హృదయంలోనే ఉన్నాడు. ఆయన మన ప్రవర్తనను చూస్తున్నాడు. మనకు తెలియబడాలి అని ఆయన అనుకొన్నప్పుడు తెలియబడతాడు. ఈలోగా మనం చేయవలసినపని ఏమిటి అంటే బయటనుండి వచ్చే వత్తిడులు, లోపలనుండి వచ్చే వత్తిడులు తగ్గించుకోవాలి. ఈ వత్తిడులు తగ్గుతూ ఉంటే హృదయాభిముఖంగా ప్రయాణం చేయగలరు. భగవంతుడు మనకు తెలియబడటానికి సిద్దంగా ఉన్నాడు, మీరు వత్తిడులు తగ్గించుకోండి. శత్రువులు, మిత్రులు నిజంకాదు. ఇవి రెండూ మనస్సులోనే ఉన్నాయి. మనస్సు పోతే ఏమీ లేదు. నీ హృదయంలో ఉన్న పరమాత్మ యొక్క అనుగ్రహం లేకుండా ఆయనను పొందలేవు, ఆయనను శరణు వేడుకో. సోక్రటీసు తన మిత్రుడితో మాట్లాడుతూ నీ భార్య మంచిది అయితే సుఖపడతావు, ఒకవేళ నీభార్య మంచిది కాదు అనుకో, గయ్యాళి అనుకో అప్పడు కూడా నీవు కంగారు పడకు, నీవు వేదాంతివి అవుతావు అని చెప్పాడు. రమణమహర్షి గొప్పవారు అని ఆయనను పొగుడుతూ ఒకడు పద్యాలువ్రాసి తీసుకొని వచ్చి ఆయనకు ఇస్తే అతనితో నేను గొప్పవాడిని అయితే నీకు ఏమి కలిసివస్తుంది, నీవు తరించే ఉపాయం చూసుకో, నిన్ను నీవు ఉద్ధరించుకో అని చెప్పారు. నారదుడు సనత్కుమారునితో నేను పెద్ద పండితుడిని, 64 విద్యలలో పండితుడిని అయినా దుఃఖం ఆగటంలేదు, భౌతికంగా నాకు ఏమీలోటులేదు అయినా దుఃఖం ఆగటంలేదు అంటాడు. అప్పడు సనత్కుమారుడు ఏమి చెప్పాడు అంటే దుఃఖం ఏవస్తువులో లేదో ఆ వస్తువును తెలుసుకొనేవరకు దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. దుఃఖం ఎక్కడలేదు? దుఃఖం చైతన్యంలో లేదు, చైతన్యానుభవం నీకు కలిగినప్పడు దుఃఖం నశిస్తుంది. మీదృష్టి ఒక రూపానికి, ఒక నామానికి పరిమితమైనప్పడు దుఃఖం మిమ్మల్ని వెంటాడుతుంది. నామరూపములకు ఆధారంగా ఉన్న, కారణాలకు కారణం అయి మూలకారణంగా ఉన్న పురుషోత్తముడిని చూస్తూఉంటే ఈ నామరూపాలు నిన్ను బంధించవు. ఏ విద్య నేర్చుకొంటే దుఃఖరహితస్థితిని పొందుతావో ఆ విద్యను నేర్చుకోలేదు. పొట్టకు సంబంధించిన విద్యలు నేర్చుకొన్నావు. అందువలన దుఃఖం నిన్ను వెంటాడుతోంది. మీరు ఏమతస్థులయినా, ఏ కులస్థులు అయినా, ఎవరి భక్తులయినా నామరూపరహితస్థితిని పొందేవరకు దుఃఖం మిమ్మల్ని వెంటాడుతుంది. ఇప్పడు మనలను ఎవరూ తీసుకొని వెళ్ళి ప్రత్యేకంగా జైలులో పెట్టనక్కరలేదు. ఇప్పడు మనం జైలులోనే ఉన్నాము. కాని జైలులో లేము అనుకొంటున్నాము. రాగద్వేషములు అనే జైలులో ఉన్నాము. బయట జైలే మెరుగు ఎప్పడో మూడు నాలుగు సంవత్సరాలలో వదిలేస్తారు. కాని మనం రాగద్వేషములు అనే జైలులో ఉన్నాము, గవర్నమెంట్ విడిచిపెట్టాలన్నా అది గవర్నమెంటు సమస్యకాదు, అది మన స్వంత సమస్య. మనమే ప్రయత్నం చేసుకొని, భగవదనుగ్రహం వలన ఈ జైలులోనుండి బయటకు రావాలి. మనం తమోగుణంలో ఉన్నాము, రజోగుణంలో ఉన్నాము కాని సత్వగుణంలో ఉన్నాము అనుకొంటున్నాము. ఇది మరీ ప్రమాదం. తమోగుణంలో ఉన్నవాడు, రజోగుణంలో ఉన్నవాడు సమాజానికి ఏమీ ఉపయోగపడడు. వాడు అల్లరి చేస్తాడు, పని సున్నా. సమాజానికి ఏదైనా చేయాలంటే ఒక్క సత్వగుణం ఉన్నవాడికే సాధ్యం. సత్వగుణాన్ని ప్రాక్టీసు చేయకుండా

లోపలఉన్న వస్తువునుమనం గ్రహించలేము. అసలుమనకు సత్వగుణమే లేదు ఇంక ఆత్మజ్ఞానం ఏమిటి.

ఒక అమ్మగారు తలపోటుతో బాధపడుతున్నారు. అవిడతో మాట్లాడుతూ మీరు తలపోటుతో చాలా బాధపడుతున్నారు అన్నాను. ఈ తలపోటు ఎందుకువస్తోందో ఆ కారణం నాకు తెలియకపోయినా, ఈశ్వరుడికి తెలుసుకదా. నేను చేసిందే నాకు వస్తుంది కాని నేను చేయనిది నాకు రాదుకదా అని ఆమె అంటున్నారు. అంటే సహజంగానే ఆమె బాధను భరిస్తున్నారు. ఈ తలపోటు తగ్గించమని ఈశ్వరుడిని అడగవచ్చుకదా అంటే అలా అడగను, అడిగితే జ్ఞానం అడుగుతాను కాని తలపోటు తగ్గించమని అడగను అంటున్నారు. ఆయన సర్వజ్ఞుడుకదా ఆయనకు తెలియకుండా నాకు ఈ తలపోటు వస్తోందా? తలపోటు వలన నాకు బాధ వస్తోంది, అది నిజమే, కాని ఆబాధ ద్వారా జ్ఞానంవైపుకు నామొఖం త్రిప్పుతాడేమో అంటున్నారు. సోక్రటీసును చూడటానికి చాలా మంది వచ్చేవారు. మిమ్మల్ని చూడటానికి చాలామంది వస్తున్నారు ఏమిటి అని అడిగితే నాకు ఏమీ తెలియదు, నాకు ఏమీ తెలియదు అన్నసంగతి నాకు తెలుసు అందుకే జనం నన్ను చూడటానికి వస్తున్నారు అన్నాడు సోక్రటీసు. గాంధీని కాల్చిచంపారు, క్రీస్తును శిలువవేసి చంపారు, సోక్రటీసును విషంపెట్టి చంపారు. లోకం అంటే అంతే, మంచితనాన్ని లోకం భరించలేదు. సోక్రటీసుకు విషం ఇచ్చేముందు రోజు రాత్రి ఆయన శిష్యులు జైలుగదికి వచ్చి పారిపోదామని అంటే ఈ శరీరం ఉండటం కంటే ఈ శరీరం పోవటం వలన లోకానికి మంచి జరుగుతుంది అంటే శరీరం విడిచిపెట్టటం నాకు ఇష్టం. నా శరీరం అలా పోవటానికి ఈశ్వరుడు నిర్ణయించి ఉంటాడు. శరీరం ముఖ్యంకాదు, ఈశ్వరుని సంకల్పాన్ని గౌరవించటం ముఖ్యం అంటాడు సోక్రటీసు. జైలునుండి పారిపోవటానికి ఆయన ఇష్టపడలేదు. మరునాడు విషం ఇచ్చారు. ఆ విషాన్ని పాయసం పుచ్చుకొన్నట్లు పుచ్చుకున్నాడు, వాడు సోక్రటీసు.

భగవంతుడు ఉన్నాడా అని భగవాన్‌ను అడిగితే నీవు ఉన్నావా అన్నారు భగవాన్. నేను ఉన్నాను అని చెప్పాడు. నీవు ఉంటే ఆయన లేకుండా ఎలా ఉంటాడు. నీవు ఉంటే ఆయన ఉన్నాడు ఈ సృష్టి అంతా తెగిపోయిన గాలిపటంలాగ లేదు. ఒక కంట్రోలర్ చేతిలో ఉంది. నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి రాకుండా నీ మనస్సులో ఉన్న చాపల్యం అడ్డువస్తోంది, నీ విపరీతధోరణి అడ్డువస్తోంది. సత్వగుణం లేకుండా సమాధిస్థితిలో ఉన్నాము అనుకొంటే ఎలాగ? అలాగ మనలను మనం మోసం చేసుకుంటే మనమే చెడిపోతాము, మనమే నష్టపోతాము. రాగద్వేషములవలన మనస్సు చిక్కబడిపోతుంది. మనస్సు చిక్కబడకుండా చూసుకోవాలి. మనస్సును పల్చగా చేసుకొంటే ఏదోరోజు అది చిరిగిపోతుంది. రోజూ అవసరాలు పెంచుకొంటూ వెళ్ళకూడదు. అవసరాలు పెంచుకొంటూవెళితే తప్పడుపద్దతులలో డబ్బు సంపాదించాలనిపిస్తుంది. అవసరాలు తగ్గించుకొంటే గాని మనం యోగాభ్యాసం చేయలేము. నీలో ఏ బలహీనత ఉందో ఆ బలహీనత లేనివారితో సహవాసం





చెయ్యి, వారి వైబ్రేషన్స్ నీ మీద పనిచేసి నీ బలహీనత రెడ్యూస్ అవుతుంది. నీకు రావణాసురిడి బుద్ధి ఉంది అనుకో, రాముడి లక్షణాలు ఉన్నవారితో సహవాసం చెయ్యి, ఎదుటివారిలో నీకు ఏదైనా దోషం కనిపిస్తూ ఉంటే అది నీలో కూడా ఉండి ఉండాలి. అది నీలో లేకపోతే ఆ దోషం ఎదుటివారిలో కూడా నీకు కనబడదు.

నీ దురలవాట్లనుండి, దురభ్యాసములనుండి, భేదబుద్ధి నుండి విడుదలపొందు తరువాత నీలోపల ఏమీ గోచరించకపోతే అప్పుడు చెప్ప లోపల ఏమీ కనబడటంలేదు అని, అంతేగాని వాటితో ఉంటూ నాకు ఏమీ తెలియటంలేదు అంటే ఎలా తెలుస్తుంది. లోపల ఈశ్వరుడు ఉన్నాడు అని తెలిసిన వారి హృదయంలోను, తెలియని వారి హృదయంలోను అందరి హృదయాలలో భగవంతుడు ఉన్నాడు. కాని అది తెలిస్తే సుఖం, తెలియకపోతే దుఃఖం. మనం సహనం పెంచుకోవాలి. సత్వగుణం లేకుండా సహనం రాదు. కాని ఇప్పడు అందరికి సహనం తగ్గిపోయింది. ఎవరికి ఓర్పులేదు. వెంటనే ఫలితం వచ్చేయాలి. ఏదో రావిచెట్టుచుట్టూ మూడుసార్లు తిరగటం వాడికోరికలు నెరవేరిపోవాలి, ఏదో యజ్ఞం చేయటం వెంటనే ఫలితం వచ్చేయాలి, లౌకికులు, పారమార్థికులు కూడా అలాగే ఉన్నారు. పాలకొల్లులో గురువుగారు ఉన్నారు. 5 నిముషాలలో మోక్షం ఇచ్చేస్తాను అంటున్నారు అంటే ఇది ఇంకా బాగుంది అని అక్కడకు పోవటం. ఇది తమోగుణం ఉన్నవారి లక్షణం. ఒకటి అర్థం చేసుకోండి మోక్షం గాని, మరి ఏదైనా గాని మనకు అర్హత లేనిది పొందలేము. ఒకవేళ ఏదైనా వచ్చినా అది నిలబడదు. కృష్ణుడు కంసుడిని చంపాడు అంటే అది మనలాగ విరోధం వలన కాదు. ఒక ధర్మశాస్త్రం ప్రకారం, లోక మర్యాద కోసం చంపాడు కాని విరోధం వలన కాదు. భగవంతుడు చేసిన పనిని మనం ప్రశ్నించకూడదు. అలా ప్రశ్నించటం మొదలుపెడితే మనం భక్తులంకాదు. అలా ప్రశ్నించటం భక్తుల లక్షణం కాదు. కొంతమంది మంచిని చెడుగా, చెడును మంచిగా తీసుకొంటారు. అంటే వారికి అవగాహన శక్తి లేదు. అన్ని యోగములలోనికి అర్థం చేసుకొనే యోగం గొప్పది. అదే భగవంతుడు చెపుతాడు. నన్ను ఆరాధించగా, ఆరాధించగా అర్థం చేసుకొనే బుద్ధిని నీకు నా చేతితో ప్రసాదిస్తాను అని చెప్పాడు. నీవు చేయవలసింది చెయ్యి తరువాత నేనుచేయవలసింది చేస్తాను. నన్ను శరణు వేడుకో. నన్ను గతిగా పెట్టుకొన్నప్పడు నీలో ఎన్ని దోషాలు ఉన్నా వాటిలో నుండి విడుదలచేసి నీకు మోక్షం ప్రసాదిస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. నీవు దు:ఖపడవలసిన పనిలేదు, నిన్ను ఉద్దరించే బాధ్యత నాది అంటున్నాడు. ఇది అర్జునుడికి చెప్పటం కాదు. ఇది లోకానికి ఇచ్చిన అభయం. నీవు పొందవలసింది నన్నే, నీకు ఉపాయం నేనే, అంతా నేనే. నీలో ఎన్ని దోషాలు ఉన్నా వాటిలోనుండి విడుదలచేసి నా స్వరూపాన్ని ఇస్తాను, నీవు దుఃఖపడవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. నాకు శరణాగతి చేసాక ఇంక నీకు దుఃఖం ఏమిటి? నీకు ఇంకా దుఃఖం వస్తూ ఉంటే నీ శరణాగతి నిజంకాదు అని అర్థం. సముద్రాన్ని చూసేటప్పడు అందులోని నీరునే చూడండి. కెరటాలను చూసిన, బుడగలను చూసినా అందులోని నీరునేచూడండి. అలాగే జీవకోటిని

చూసేటప్పుడు కూడా అంతర్యామిగా ఉన్న భగవంతుడినేచూడండి. రూపదృష్టి, నామదృష్టి తగ్గించుకోండి. లోచూపు నేర్చుకొని హృదయంలోనికి చేరటానికి ప్రయత్నం చేయండి. హృదయంలోనికి చేరిన వాడికి ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా సుఖమే. కొంతమంది యజమాని మెప్పకోసం ఆయన ఎదురుగా పనిచేస్తున్నట్లు అటుఇటు తిరుగుతారు. ఏపని చేయరు. వారిని ఒకవేళ యజమాని మెచ్చుకొన్నా చివరకు మిగిలేది దుమ్మే. అసలు పనిచేసేవారు నిర్మలంగా పనిచేసుకొనిపోతారు, వారు భగవంతుని దయకు పాత్రులవుతారు. మనం చేసేపని నిర్మలంగా, నిశ్శబ్దంగా, కూల్‌గా చేయాలి, గుర్తింపుల కోసం చేయకూడదు. ఆత్మకు గుర్తింపులు అక్కరలేదు. అహంభావనకు గుర్తింపులు కావాలి. గుర్తింపులవలన అహంభావన పెరుగుతుంది. అంటే మనం ఏదైతే పోగొట్టుకోవాలో గుర్తింపుల వలన అది పెరుగుతుంది. నీలోపల ఒక సద్వస్తువు ఉంది. అది నీకు తెలియకపోయినా మనోదేహములు నీకు తెలుస్తున్నాయి. నీ మనోదేహములను లోపలఉన్న సద్వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ఉపయోగించుకో. అది తెలుసుకోకుండా నీవు లోకంలో ఏది సాధించినా అవి అన్నీ స్వప్నంతో సమానము.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 5-1-03, లంకలకోడేరు**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం భక్తితో, శ్రద్ధతో, నమ్రతతో, త్రికరణశుద్ధిగా ఒక పని ప్రారంభించినప్పుడు ప్రారంభంలో పెద్ద సహకారం లేకపోయినా స్లోగా స్టడీగా సహకారం అందుతుంది, అయితే మనం చేసే పని హృదయపూర్వకంగా చేయాలి, నిరాడంబరంగా చేయాలి, నిరహంకారముగా చేయాలి, అలాచేస్తే ఆపని సక్సెస్ అవుతుంది. మనం భౌతికరంగంలో కాని, ఆధ్యాత్మికరంగంలో కాని అభివృద్ధిలోనికి రావాలంటే ఆత్మవిశ్వాసం చాలాముఖ్యం. బాహ్యసంఘటనలు, పరిస్థితులు మనకు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు, వాటి ప్రభావం మన మెదడు మీద పడకుండా ఉండాలంటే మనకు ఆత్మవిశ్వాసం ముఖ్యం. ఆత్మవిశ్వాసం లేకపోవటం వలన మనం మానసిక అనారోగ్యానికి గురవుతాము. మరణానంతరజీవితం మాట అటు ఉంచండి, ఇప్పుడు మన శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం కాపాడుకోవటానికి ఆత్మవిద్య ఎంతో ఉపయోగపడుతుంది. మన శరీరం ఉన్నంతసేపు ఎక్కడో ఒకచోట ఉండాలి. మనం ఎక్కడ ఉన్నా సమాజం ఉంటుంది. సమాజంలో అనేక సమస్యలు ఉంటాయి, కుటుంబపరంగా సమస్యలు వస్తూ ఉంటాయి. ఆ సమస్యలను విడిచిపెట్టి పారిపోకుండా, ఆ సమస్యలను పరిష్కరించుకోవటానికి ఆత్మవిద్య సహకరిస్తుంది. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. మన ప్రాణానికి ప్రాణమై, మనస్సుకు మనస్సై, మనకు అతిసన్నిహితంగా భగవంతుడు ఉన్నాడు. భగవంతుడు ఎక్కడో ఉన్నాడు అనుకోవటం కంటే మనకు సన్నిహితంగా మనలోనే ఉన్నాడు అని అనుకొంటే సాధనకు ఉపయోగపడుతుంది. భగవంతుడు వైకుంఠంలో ఉన్నాడు,





కైలాసంలో ఉన్నాడు అని అలవాటు పడ్డాము. వైకుంఠం అంటే వికృతులు లేనిది, వికారములు లేనిది. మనం కూడా వికారములు లేకుండా, వికృతులు లేకుండా ఉంటే మన హృదయంలో ఉన్న వైకుంఠం ఇప్పడే మనకు వ్యక్తమవుతుంది. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని నీ హరి ఎక్కడ ఉన్నాడు అని అడిగితే హరి వైకుంఠంలో ఉన్నాడు అని చెప్పలేదు. అంతటా ఉన్నాడు అని ప్రహ్లాదుడు చెప్పాడు. అయితే ఈ స్థంబంలో ఉన్నాడా అని అడిగితే, అంతటా ఉన్నవాడు ఈ స్థంబంలో లేకుండా ఎలా ఉంటాడు అన్నాడు. అప్పడు గద పుచ్చుకొని ఆ స్థంబాన్ని కొడితే స్థంబంలో నుండి హరి వస్తాడు. అంతటా ఉన్నవాడు స్థంబంలో కూడా ఉన్నాడు, స్థంబంలో ఉన్నవాడు ఒక రూపాన్ని తీసుకొన్నాడు అంతే. మనం భవిష్యత్‌గురించి ఎక్కువ ఆలోచించి వర్తమానకాలాన్ని పాడుచేసుకొంటున్నాము. వర్తమానకాలాన్ని గాలికి వదిలేసి, వచ్చే సంవత్సరంలోఏదో వస్తుంది. ఆ సంవత్సరంలో ఏదో చేద్దాము అని ఆలోచించుకొంటూ ఉంటే ఇప్పడు ఈ సంవత్సరంలో ఉన్నాముకదా, ఈ కాలాన్ని ఉపయోగించుకోవాలి కదా. వర్తమానకాలాన్ని వదిలేసి భవిష్యత్‌కాలంగురించి ఆలోచించటం భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను కూడా మంచిది కాదు.

ఎక్కడికి వెళ్ళి చూసినా, ఏదేశం వెళ్ళినా ఏమీ లేదు, వింత ఏమీ లేదు. ఇక్కడ చిన్న మేడలు ఉండవచ్చు, అమెరికాలో పెద్ద పెద్ద మేడలు ఉండవచ్చు. ఇక్కడ వెల్త్ తక్కువ ఉండవచ్చు, అక్కడ వెల్త్ ఎక్కువఉండవచ్చుగాని మానవస్వభావం ఎక్కడికివెళ్ళినా ఒక్కటే. మానవస్వభావంలో ఉన్న ఇరుకు ఎక్కడికివెళ్ళినా ఒక్కటే. మనందరము మరణిస్తున్నాము అనుకొంటున్నాము. ఆమరణానికి మరణం తీసుకొని రావాలి, దానికే సాధన. శరీరానికి మరణం ఉంది, మన హృదయంలో ఉన్న చైతన్యానికి మరణం లేదు. మరణానికి మరణం తీసుకొని రావటం అంటే మన హృదయంలో ఉన్న మరణంలేని వస్తువును తెలుసుకొంటే మనకు మరణం లేదు అన్న సంగతి తెలుస్తుంది. అదే మన జీవిత గమ్యం. మనం ఆత్మలోనే ఉన్నాము, చైతన్యంలోనే ఉన్నాము, అందులో సందేహం లేదు. కాని ఆత్మలో ఉన్నాము అన్న సంగతి మనకు తెలియటంలేదు. అందుచేత దుఃఖం మనలను వెంటాడుతోంది. మనం ఆత్మలోనే ఉన్నాము అన్న సంగతి మనకు తెలియకుండా మన రాగద్వేషములే అడ్డువస్తున్నాయి. రాగం వేరు, దయ వేరు. దయ మంచిదే కాని రాగం మంచిది కాదు. దయకు పరిమితులు లేవు, స్వపర భేధం లేదు. రాగం అంటే మోహం, రాగానికి పరిమితులు ఉన్నాయి. రాగం ఉన్నవాడు పరిమితులలో ఇరుక్కుపోయి ఆ రోజుకారోజు వాడి స్వభావం ఇరుకైపోతుంది. రాగంలో ఉన్నవాడు మరణిస్తూ ఉంటాడు, జన్మిస్తూ ఉంటాడు, వాడు మరణానికి మరణం తీసుకొని రాలేడు.

మనం లేనిపోని విషయాలు ఊహించుకొంటాము. దాని వలన భయం కలుగుతుంది. భయపడవలసిన విషయం అంటూ ఏమీ లేదు. ప్రతీ చిన్నవిషయం కూడా ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతోంది. అది మనకు తెలియకభయం కలుగుతోంది. భయం నుండి విడుదల

పొందు, రాగం నుండి విడుదల పొందు అని భగవంతుడు పదే పదే చెప్పాడు. నేను ఏదో గొప్పవాడిని అనుకోవటం వలన, నేను తక్కువవాడిని అనుకోవటం వలన మనిషి పతనమవుతాడు. కొంతమందికి సబ్జక్టుపట్ల సరియైన అవగాహన ఉండదు. ప్రతీచిన్న విషయానికి తిక్కపెట్టుకొంటారు. ఆ తిక్క పెట్టుకొన్న వారు చివరకు పిచ్చివారుగా తయారవుతారు. కొంతమంది మనుషులు ఎలాఉంటారు అంటే వారి అభివృద్ధి వారికి తెలియదు, మనం చెపితే వినరు. మన హృదయంలో భగవంతుడు ఉన్నాడు కాని మనకు అనుభవంలో లేడు. ఆయన మనకు అనుభవం లోనికి రాకుండా కామక్రోధములే అడ్డువస్తున్నాయి. భగవంతుడు అనుభవంలోనికి రాకుండా మనకు ఏ విషయాలయితే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికే సాధన ఉద్దేశింపబడింది. ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి మనం అందరం ఈశ్వరానుగ్రహంలోనే ఉన్నాము కాని ఉన్నాము అన్న సంగతి మనకు తెలియటంలేదు, అది తెలిస్తే భయరహితస్థితిని పొందుతాము. మనకు అసాధ్యం ఉంది కాని భగవంతుడికి అసాధ్యం అంటూ ఏమీ లేదు. పరిస్థితులు మనకు వ్యతిరేకంగా ఉంటే భగవంతుని దయలేదు అనుకొంటాము, అది కూడా మన మంచికోసమే అలా జరుగుతోంది అని మనకు తెలియక కంగారు పడుతున్నాము. అంటే మనం ఈశ్వరుడి రక్షణలోనే ఉన్నాము, ఆయన దయలోనే ఉన్నాము అని గుర్తింపు మనకు రావటం లేదు. నిజమైనభక్తుడు మాత్రమే అది గుర్తించగలడు, భక్తి లేనివాడికి అది సాధ్యం కాదు. బ్రహ్మం గుణాతీతం అని చెపుతారు. అంటే తమోగుణానికి, రజోగుణానికి, సత్వగుణానికి అతీతం. ఇప్పుడు మనం చేయవలసిన సాధన ఏమిటి అంటే తమోగుణాన్ని, రజోగుణాన్ని తగ్గించుకోవాలి, సత్వగుణాన్ని ప్రాక్టీసు చేయాలి. సత్వగుణాన్ని ఎలా తొలగించుకోవాలి అని ప్రయత్నం చేయవద్దు. అలా అనుకొంటే ఇహం చెడుతుంది, పరం చెడుతుంది. సత్వగుణం కూడా గుణమే కాని ఆత్మజ్ఞానసముపార్జనకు అది సహకరిస్తుంది. కురుపు తగ్గిన తరువాత పెచ్చు దానంతట అదే రాలిపోతుంది, బలవంతంగా లాగితే మరల చీముపడుతుంది. సత్వగుణం ఆత్మజ్ఞాన సముపార్జనకు సహకరించి దానంతట అదే తప్పకొంటుంది, దానిని మనం బలవంతంగా లాక్కొంటే ఇహం, పరం రెండూ చెడిపోతాయి. సత్వగుణంలో ఉంటే బాహ్యసంఘటనల ప్రభావం మీ బ్రెయిన్ మీద ఏమీ పడదు. లోకంలో ఏ సంఘటన జరిగినా మీరు ఆఫ్‌సెట్ అవ్వవద్దు. మీ అబ్బాయికి పెళ్ళి అయిన తరువాత మీ మీద కొంచెం ఇష్టం తగ్గుతుంది, భార్య మీద వాడికి ఇష్టం పెరుగుతుంది. ఏమిటి మా అబ్బాయి దూరమయిపోతున్నాడు, మా కోడలుకు దగ్గరయి పోతున్నాడు అని ఏడుస్తూ కూర్చోవద్దు, అది లోకం యొక్క స్వభావం అనుకోండి. అలా ఏడుస్తూ కూర్చొంటే మీ సాధన చెడిపోతుంది. లోకంలో ఎవరికైనా మీరు ఉపకారం చేసారు అనుకోండి వారందరూ కృతజ్ఞతగా ఉండాలని అనుకోవద్దు. వారందరూ మీకు ఉపకారం చేయనక్కరలేదు. మీకు తాటాకులు కట్టకుండా ఉంటే సరిపోతుంది. వారు అందరూ కృతజ్ఞతగా ఉండాలి అని మీరు అనుకొంటే లోకం

**05-02-2003**



యొక్క పోకడ మీకు తెలియటంలేదు అని అర్థం. లోకం కుక్కతోకలాంటిది, కుక్కతోక వంకర ఎవడు తీయగలడు. అందుచేత లోకం యొక్క గొడవ వద్దు. మీకు చేతనయినంత మంచి చేయండి, అది కూడా నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేయండి. ఈశరీరం మరణించాక కొంతమంది పుణ్యలోకానికి, కొంతమంది పాపలోకానికి వెళ్ళవచ్చు. అవి అన్నీ మీ పుణ్యం, మీ పాపం అనుభవించటానికి ఉన్నాయి కాని ఆలోకాలు ఏమీ మీకు సాధనకు పనికిరావు. ఇది అర్థం చేసుకోండి. ఆలోకాలలో పుణ్య, పాపాలు అనుభవిస్తారు. మరల సాధన చేసుకోవటానికి ఈ భూమి మీదకు రావలసిందే, శరీరం ధరించవలసిందే. శరీరం మరణించాక ఏదోచేద్దాము అని అనుకోవద్దు. మన సాధనకు పనికివచ్చే లోకం ఈ భూమి ఒక్కటి మాత్రమే. అందువలన ఇక్కడ కాలాన్ని పాడుచేసుకోవద్దు. మీ సాధనకు ఉపయోగించుకోండి. ఇక్కడే మనం ప్రయత్నంచేసి ఈశరీరానికి మరణం రాకముందే మరణంలేనిస్థితిని పొందాలి. శరీరం మరణించిన తరువాత మనం చేసేది ఏమీ లేదు.

మనం ట్రైనింగ్ పొందటానికి ఈలోకంలోనికి వచ్చాము. ఏదో కాలేజీలో చేరితే అక్కడ ఉండిపోముకదా. చదువు పూర్తిచేసుకొని వచ్చేస్తాము. అలాగే ఈ లోకంలోనికి వచ్చినందుకు ట్రైనింగ్ అయ్యి బయటకుపోవాలి. ప్రస్తుతం మనం సత్వగుణాన్ని ప్రాక్టీసు చెయ్యాలి. సత్వగుణం లేకపోతే సంపాదించుకోవాలి, ఉంటే దానిని అభివృద్ధి చేసుకోవాలి. సత్వగుణంలో ఉన్నవాడికి మనోనిగ్రహం వస్తుంది. మనోనిగ్రహం రాకపోతే మనస్సుకు లోచూపు రాదు. దానికి లోచూపు వస్తే గాని లోపలఉన్న వస్తువు అనుభవంలోనికి రాదు. ఈ మధ్య ఒక భక్తుడు నాతో మాట్లాడుతూ రోజూ దేవుడిని ప్రార్థిస్తున్నాను అని చెప్పాడు. భగవంతుడిని ఏమైనా అడుగుతున్నావా అని అడిగాను. ఏమీ అడగటం లేదు అని చెప్పాడు. ఏదైనా అడగవచ్చు కదా అంటే మీరు అడగమంటే అడుగుతాను అన్నాడు. ఏమని అడుగుతావు అంటే ఈ ప్రార్థించే వాడు శేషం లేకుండా పోవాలి అని ప్రార్థిస్తాను అని చెప్పాడు. కొంతమంది నిన్ను పొగిడేవారు, కొంతమంది నిందించే వారు ఉంటారు. అప్పుడు నీవు మనస్సును సమానంగా ఉంచుకోవాలి. నీకు ఆధ్యాత్మిక బలం ఎంతఉందో తెలుసుకోవటానికి భగవంతుడు పరీక్షలు పెడుతాడు, అంతేగాని నిన్ను పాడుచేయటానికి కాదు. మీ జీవితంలో ఏసంఘటన జరిగినా అది భగవంతుడికి తెలియకుండా జరగటం లేదు, అందుచేత కంగారుపడవద్దు. ఏదో అయిపోతుంది అని భయపడవద్దు. అంతా ఆత్మే, ఆ దృష్టి మనకు వస్తే ఎవరిని ద్వేషిస్తాము, ఎవరికి అపకారం చేస్తాము. అఖండదృష్టి, అబేధదృష్టి మనకు రావటంలేదు, అది వస్తే గాని ఆత్మజ్ఞానం కలుగదు. మీ కుటుంబాన్ని విడిచిపెట్టి సంవత్సరానికి 15 రోజులు బయటకు వెళితే అప్పడు అసలు మీకు మోహం ఉందాలేదా, బంధం ఉందా లేదా అని తెలుస్తుంది. మీ మనస్సులో ఉన్న బలహీనతలు తెలుస్తాయి, ఇంటిదగ్గర ఉంటే తెలియదు. మనం 24 గంటలు జపధ్యానములు చేయలేముకదా. అందుచేత ఎంతోకొంత సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తూఉంటే అది కూడా జ్ఞానసముపార్జనకు మనకు సహకరిస్తుంది. ఇది గుర్తు పెట్టుకోండి.

**రమణ భాస్కర**

రామకృష్ణుడు ఏమి చెప్పాడు అంటే ముందు మీరు చీమలుగా ఉండటం నేర్చుకోండి అనిచెప్పాడు. ఇసుక, పంచదార కలిపి ఒకచోట పడవేస్తే పంచదార పట్టుకొనిపోతాయి, ఇసుకను వదిలేస్తాయి. లోకం అంటే మంచి చెడ్డల మిశ్రమం. కేవలం మంచి ఉండదు, కేవలం చెడు ఉండదు. రెండూ ఉంటాయి. నీవు మంచిని తీసుకో, చెడ్డను వదిలెయ్యి. మీరు స్వర్వకాల సర్వావస్థలలో, మీరు ఎక్కడ ఉన్న, పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీ శాంతిని పాడుచేసుకోవద్దు. ఎవడి జీవితం సమానంగా ఉండదు, హెచ్చుతగ్గులు ఉంటాయి, వాటిలో నుండి మనం పాఠాలు నేర్చుకోవాలి, శాంతిని కాపాడుకోవాలి. మీరు దొంగనేను, మిధ్యానేను అని చెపుతున్నారు, దాని మూలం మీలోపలే ఉంది, అక్కడే భగవంతుడు ఉన్నాడు అని చెపుతున్నారు. అక్కడికి వెళ్లటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే దొంగనేనే అడ్డువస్తోంది అంటున్నారు. అది అడ్డు వచ్చేమాట నిజమే ఎందుచేతనంటే దాని మూలంలోనికి వెళితే అది నశిస్తుంది, అందుచేత దొంగనేనే అడ్డువస్తుంది, అది పోవటానికి అది ఇష్టపడదు. అందుచేత మిధ్యానేనును ప్రక్కన పెట్టి, దానికి అతీతంగా ఉండి ఆ మూలాన్ని మనం చూడాలి, అప్పడు మీకు మూలం వ్యక్తమవుతుంది. దొంగనేనును అడ్డురానివ్వకూడదు, దాని గొడవ వదలుకోవాలి. దానిని మర్చిపోతే ఏమీలేదు. మీరు జరిగిపోయిన గొడవలు అంటే భూతకాలం అంతా మర్చిపోండి. మీరు శాంతిగా ఉండగలుగుతారు. జరిగిపోయిన సంఘటనలు తలపెట్టుకోవటం వలన సాధన సాగదు, రజోగుణం పెరుగుతుంది. మీకు లోచూపురాదు, భగవంతుడికి దూరమవుతారు. మిమ్మల్ని ఎవరైనా అవమానం చేసారు అనుకోండి, దానిని తలపెట్టుకొంటూ ఉంటే వారి మీద ప్రతీకారం తీర్చుకోవాలి అనిపిస్తుంది. దానిని మర్చిపోండి, వారి సంగతి భగవంతుడే చూసుకొంటాడు. జీవితంలో అన్నీ తలంపులే. తలంపు వచ్చినప్పడు అది ఎక్కడ నుండి వస్తోంది, దాని మూలం ఎక్కడ ఉంది అని దాని మూలాన్ని చూడటానికి ప్రయత్నంచేస్తే తలంపు పారిపోతుంది. భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నీ పాడుబుద్ధికి జ్ఞానం రాదు నన్ను ఆరాధించగా ఆరాధించగా, నాకు ఇష్టమైన పనులు నీవుచేస్తూఉంటే, నాయందు గౌరవం కలిగిఉంటే, నేను చెప్పిన మాటలను అర్థంచేసుకొని ఆచరించటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే నీ పాడుబుద్ధిని తొలగించి, నీకు ఎటువంటి బుద్ధిని ఇస్తే నేను అనుభవంలోనికి వస్తానో అటువంటి బుద్ధిని నీకు ప్రసాదిస్తాను అని చెప్పాడు. మనం భక్తిని విడిచిపెట్టకూడదు, భక్తి జ్ఞానాన్ని తీసుకొని వస్తుంది. నీకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో, ఆ దొంగ నేను యొక్క మూలాన్ని చూడటమే, దానిని తొలగించుకోవటమే విచారణమార్గం యొక్క లక్ష్యం. నీకు ఎవరైనా సంతోషం కలిగించేమాటలు, దుఃఖం కలిగించేమాటలు చెప్పవచ్చు. సంతోషం కలిగించే మాటలు చెప్పినప్పడు సంతోషం ఎవరికి వస్తోంది. దుఃఖం కలిగించే మాటలు చెప్పినప్పడు దుఃఖం ఎవరికి వస్తోంది? ఈ రెండూ దొంగనేనుకే వస్తున్నాయి. ఈ రెండూ వదిలేయమంటున్నారు భగవాన్. మీ హృదయంలో ఉన్న ఆనందం మీకు అందుతూ ఉంటే బాహ్యసంఘటనలు ఎలా ఉన్నా, మీ కుటుంబపరిస్థితులు ఎలాఉన్నా కూడా మీ మనస్సు చెదరదు. రమణమహర్షిలో ఏమీ విశేషం లేదు అని మీరు అంటారు అనుకోండి మా మనస్సు చెదరదు. ఎవరి రక్షణలో మేము ఉన్నామో, ఎవరి అనుగ్రహం వలన మాకు జ్ఞానం కలుగుతోందో వారిలో విశేషం లేదు అంటే ఎలా నమ్ముతాము. పంచదారలో తీపి లేదు అని మీరు చెపితే నమ్మేటంత అమాయకులం కాదు. ఎందుచేతనంటే పంచదార ఆల్‌రెడీ రుచి చూసాము. ఏమండీ మాకు ఒకోసారి సంతోషం ఉంటుంది, ఒకోసారి సంతోషం ఉండటంలేదు అని భగవాన్‌తో అంటే ఆ సంతోషం ఎవరికి వస్తోందో చూడు. ఆ నేనును అర్థం చేసుకొంటే సంతోషం ఉన్నా ఒకటే, పోయినా ఒకటే అన్న సంగతి నీకు తెలుస్తుంది అని చెప్పారు. దేహం చనిపోయినప్పడు ఏ నేను అయితే బాధపడుతుందో ఆ నేను నీకు అర్థమయితే దేహం యొక్క చావుకు కూడా ఏమీ ప్రాధాన్యత ఉండదు. మూలతలంపు మూలంలోనికి వెళ్లి ఆ హృదయస్థలంలో మనస్సును నిలబెట్టి ఉంచటమే యోగం, అదేభక్తి, అదేజ్ఞానం, అదేకర్మ. నిన్ను నీవు తెలుసుకోవటానికి ఉపయోగపడేది కర్మకాకపోతే ఏది కర్మ, జ్ఞానసముపార్జనకు ఒక పని ఉపయోగపడుతూ ఉంటే అది పనికాకపోతే ఏది పని. మాలో దేవుడు ఉన్నాడు కదా అంటే ఉన్న మాట నిజమే. అయితే అది అనుభవంలో ఉందా అంటే భగవదనుభవం మనకు లేదు. ఇది బాగాఅర్థం చేసుకోండి. బుడగ బుడగగా నిజంకాదు బుడగ నీరుగా నిజం. బుడగను నీరుగా చూస్తారు అనుకోండి వికారాలు రావు. మీరు నామరూపములకు ఆధారంగా ఉన్న వస్తువును చూడటం మానేసి మీ దృష్టి నామరూపములకు పరిమితమైతే మీరు బంధింపబడతారు, మీకు లోచూపురాదు. ఆత్మజ్ఞానంకలుగదు. అందరిలోను అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మనం చూడలేక పోతున్నాము, మన దృష్టి నామరూపాలకు పరిమితమైపోతోంది. నోటితో అందరిలోను ఈశ్వరుడు ఉన్నాడుఅంటున్నాము కాని అనుభవంలో లేదు. నామ రూపదృష్టిలోనుండి విడుదలపొందితేగాని నామరూపములకు ఆధారంగా ఉన్న వస్తువు అనుభవంలోనికి రాదు. మనం ఎంతసేపు నామరూపములతో ఉంటున్నాము. గోడమీద పేర్లు పెట్టటం గురించి పేచీలుపెట్టుకొనే వారు చాలామంది ఉన్నారు. ఇది అంతా అజ్ఞానం కాకపోతే ఏమిటి? దీనివలన నీకు జ్ఞానం వస్తుందా? నువ్వు పని చెయ్యి ఎలా పని చేస్తే నీకు జ్ఞానం కలుగుతుందో అలా పనిచెయ్యి అంతేగాని నీవు చేసే పద్ధతిలో పనిచేస్తే నీకు జ్ఞానం రాదు, అది కర్మయోగం కాదు. లోకంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. సమాజపరంగా, కుటుంబపరంగా అనేక సమస్యలు వస్తూఉంటాయి. ఆ సంఘటనలు జరిగినప్పడు ఒకోసారి సంతోషం, ఒకోసారిదుఃఖం వస్తుంది. భగవాన్ చెప్పేదిఏమిటి అంటే ఆ సంఘటనలను జరగనివ్వండి, అది ప్రకృతి. ఆ సంఘటన జరిగినప్పడు సంతోషంవస్తే పొంగిపోయే ఆ నేను ఎవరు? దుఃఖంవస్తే కృంగిపోయే ఆ నేను ఎవరు? ఆనేనును మీరు అర్థంచేసుకొంటే, ఆనేనును మీరు పరిశీలిస్తే దానిని విచారణ చేస్తే, ఆనేనును శోధించి శోధించి దాని మూలాన్ని చూస్తే మీకు సిద్ధి కలుగుతుంది. నేనును శోధించి, శోధించి దాని మూలాన్ని సాధించండి, అప్పడు మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అప్పుడు మీకు ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా ఆనందమే.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు


| | | |
|---|---|---|
| 08-02-2003 | శనివారం | చించినాడ గీతా మందిరం |
| 19-02-2003 | బుధవారం | గణపవరం సాయిబాబా మందిరం |
| 23, 24-02-03 | ఆది, సోమ | సఖినేటిపల్లి, గీతా మందిరం |
| 26-02-2003 | బుధవారం | శివదేవుని చిక్కాల |

### నిన్నటి పొరపాట్లే - నేటి పాట్లుకు కారణం

జీవుడు తన వాహనమైన శరీరంతో యీ జగత్తు అనే సంసార సాగరంలో, అనేక జన్మలలో తనకు అనుభంధం కల్పించబడిన వ్యక్తులతో కూడి అనుభవాలను గడిస్తూ, ఆకర్షణలను పోగుజేసుకొంటూ, రాగద్వేషాలను పెంచుకొంటూ వాటిని వాసనల రూపంలో, ఆగామి, సంచితం, ప్రారబ్దమనే సంచుల్లో నిల్వజేసుకొని, జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉంటాడు. ప్రస్తుతం మనకు తారసపడ్డ కష్ట సుఖాలు అన్ని గతజన్మలలో సంపాదించినవే, ఈ నగ్న సత్యాన్ని గ్రహిస్తే ఆ సంకటాలను ధైర్యంగా - శాంతంగా స్వీకరించి సుఖంగా జీవించవచ్చును. ప్రారబ్ధ కర్మనే విల్లునుంచి వదలి పెట్టిన బాణం అంటారు. అది గమ్యాన్ని చేరుతుంది. దాన్ని ఎవరూ ఆపలేరు. వివేకానంద ఇలా అంటారు " ప్రశ్న వేయటమే గాని, సమాధానం కోరుకొనే అధికారం మనకు లేదు, అంతా ఈశ్వరేచ్ఛ దానికి లొంగి ఉండవలెను, నోరెత్తరాదు సర్వమూ దైవమిప్పటికే నిర్ణయించాడు. వచ్చు విపత్తులను ప్రశాంత బుద్ధితో అనుభవించాలి, లేదా ఘోర కష్టాలు విధించబడును" అని. ఈ సంపూర్ణశరణాగతిని అనుసరిస్తే "ఏది జరిగినా ఎవరినీ నిందించవలసిన పనిలేదు. మన కర్మలే మనకు ఎదురౌతాయి. ఎంతచేసామో అంతా అనుభవించాలి. దుఖఃకరమైన ఒక పాఠం నేర్పటానికే దుఃఖం వస్తుంది. వేదాలసారాన్ని అంతా కాళిదాసు ఒక్కమాటలో యిలా అన్నారు. "చేతనైతే ఉపకారం చెయ్యి - అపకారం చెయ్యకు, తరిస్తావు." చాలామంది జరిగిన అపకారానికి ప్రతీకారం మన కళ్లముందే తీర్చుకోవటంలోనే ఆనందం ఉందని భ్రమపడి ప్రతీకార చర్యలతో మరల కర్మసముద్రంలో పడి శాశ్వతగతిని నిరోధించుకొంటారు. ఫలితాలు లెక్కలు వేసుకొని కలత చెందకుండా వాటి యందు నిస్పృహ గలవాడే నిజమైన సుఖి, గత కాలాన్ని భవిష్యత్తును స్మరిస్తూ ఉండేవాడికి లోచూపు ఉండదు" అన్నారు భగవాన్. గతకాలానికి కాంక్రీటు గోడ కట్టాలి, వాటితో జీవిస్తే ఘర్షణ తప్పదు. జీవితంలో సామరస్యతను అలవర్చుకోవాలి. "నీ ఇచ్ఛయే నెరవేరుగాక" అనే ప్రార్ధన మన హృదయం నుండి రావాలి. కుమ్మరి కుండను ఒక సంవత్సరంపాటు కష్టపడి ఎన్నెన్నో నగిషీలతో రంగులతో అందంగా తీర్చిదిద్దినా, ఒక్క తన్నుతో పగిలి నామరూపాలు లేకుండా పోతుంది. అలాగే మన గతజన్మల కర్మబంధనాలు అన్నీ సద్గురు ఒక్క కరుణా కటాక్షంతో తెగిపోతాయి. సాధకుడు, సహనంతో సాహచర్యం చెయ్యాలి. అది ఉందా జీవితం సఫలమౌతుంది.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం

## మల్కిపురంలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం





మలికిపురం, జనవరి 21 (న్యూస్‌టుడే) : మలికిపురంలోని ప్రతిష్ఠాత్మక శ్రీ షిరిడీ సాయిబాబా చతుర్ధ వార్షికోత్సవ వేడుకలు మంగళవారంఘనంగా జరిగాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి శ్రీసాయిబాబా వారికి సహస్ర కలశక్షీరాభిషేకం జరిగింది. 1001 కలశాలతో భక్తులు బాబా విగ్రహాన్ని ఆవుపాలతో అభిషేకించారు. దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్ధం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాజోలు ఎమ్మెల్యే శ్రీ ఎ.వి. సూర్యనారాయణరాజు, రాజోలు కాంగ్రెస్ నాయకుడు శ్రీ అల్లూరి కృష్ణంరాజు, శ్రీ కె.వి. రామకృష్ణంరాజు (చంటిరాజు), శ్రీ రుద్రరాజు సత్యనారాయణ రాజు, సర్పంచి, శ్రీ చెల్లుబోయిన వెంకటలక్ష్మణరావు, శ్రీ కంతేటి వెంకట్రామరాజు, శ్రీ ముదునూరి లింగరాజు, తదితర ప్రముఖులు ఆలయాన్ని సందర్శించి సాయిబాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం జిన్నూరు సద్గురు శ్రీ నాన్నగారు ఆధ్యాత్మిక ప్రవచనం చేసినారు.